epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 30 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 27 డిసెంబర్ 2025 | పేజీలు : 04




2 లో

జనగామ పీఏస్‌లో

## తనిఖీలు

- సిబ్బందికి పలు సూచలు చేసిన ఏఎస్పీ చేతన్



# అటు దర్శనాలు.. ఇటు పనులు

## మేడారంలో సందడే.. సందడి..

మేడారం జాతర పనులు జోరందుకున్నాయి. మహా జాతరకు మరో నెల రోజులు గడువు ఉండడంతో అధికారం యంత్రంగా పనులను మరింత స్పీడప్ చేసింది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయని, నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు. ఓ వైపు పనులు జరుగుతుండగా.. మరో వైపు భక్తుల రాక కూడా రోజురోజుకు పెరుగుతుంది.









# అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలను ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులపై మున్సిపల్ కమిషనర్ కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ హుస్నాబాద్ సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని వ్యాపారుల పట్ల అధికారులు బ్రతిమిలాడే ధోరణి మానుకొని చట్టప్రకారం చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని మెయిన్ రోడ్, రామవరం రోడ్, నాగారం రోడ్, అక్కలపేట రోడ్లలో రోడ్లు మరియు డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. దుకాణాల ముందు చిరువ్యాపారుల పేరుతో వేల రూపాయలు వసూలు చేసి అక్రమంగా స్థలాలు కేటాయిస్తున్నారని, దీని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆరోపించారు.

**హెచ్చరికలకే పరిమితమైన చర్యలు..**

మున్సిపల్ కమిషనర్ మరియు పోలీస్ శాఖ ఇప్పటికే రెండుసార్లు అవగాహన కల్పించి హెచ్చరించినా కూడా వ్యాపారుల తీరు మారలేదని అనంతస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై పెట్టిన బోర్లు, వస్తువులు తొలగించినప్పటికీ మళ్లీ అదే విధంగా పునరావృతం చేయడం ద్వారా అధికార వ్యవస్థను వ్యాపార వర్గాలు లెక్కచేయడం లేదని విమర్శించారు.

**పార్కింగ్ సమస్యతో ట్రాఫిక్ గందరగోళం..**

పార్కింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల హైవే రోడ్డుపై వాహనాలు నిలపడం జరుగుతోందని, దీని వల్ల భారీ వాహనాలు, ప్రజా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చివరకు పోలీసులు వాహనదారులపై జరిమానాలు విధించడం ద్వారా సామాన్య ప్రజలే నష్టపోతున్నారని అన్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు...**

మున్సిపల్, పోలీస్ శాఖలు వ్యాపారులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వ్యాపారులకు రాజకీయ అండదండలు ఉన్నాయా? లేక అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

**చట్టరీత్యా చర్యలు లేకపోతే ఆందోళన...**

ఇప్పటికైనా మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖలకు చిత్తశుద్ధి ఉంటే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వ్యాపారులపై ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వరియోగుల అనంతస్వామి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.





# జనగామ పీఎస్‌లో ఏఎస్పీ వార్షిక తనిఖీ

**జనగామ, మన చౌరాస్తా :** వార్షిక తనిఖీ భాగంగా ఏఎస్పీ పండరి చేతన్ నితిన్ జనగామ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కిట్ మెయింటెనెన్స్, నీట్ టర్న్ ఔట్, విధి నిర్వహణలో క్రమశిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యాలను పరిశీలించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, కేసు డైరీలు, సీడీ ఫైళ్లు, వివిధ రిజిస్టర్లు, ఇతర అధికారిక దస్తావేజులను సవివరంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల స్థితిగతులు, దర్యాప్తు పురోగతి, రికార్డుల అప్డేట్ విధానం, స్టేషన్ పరిశుభ్రత, అలాగే ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి కేసును పారదర్శకంగా, సమయపాలనతో దర్యాప్తు పూర్తిచేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి

## బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వడ్లకొండ వినయ్



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జీ వడ్లకొండ వినయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఒక గౌరవ ప్రథమైన పదవిలో ఉండి తన నోటికి వచ్చినట్లు దిగజారుడు మాటలు మాట్లాడం సిగ్గు చేటు ఉందన్నారు. 'నీ మర్యాద, నీ భాషకు తెలంగాణ ప్రజలు ఇలాంటి వ్యక్తా మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి..' అని సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జడ్పిటిసి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచిన నీకు పాలనలో ఎంత పట్టు ఉందో గత రెండు ఏండ్ల కాలంలో ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. దొంగ ముచ్చట్లు, కల్లబొల్లి మాటలు నమ్మలేని కొడంగల్ ప్రజలు ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డిని ఓడగొట్టారని అన్నారు. ఇప్పటికైనా తమ నాయకుల మీద చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు.



# మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

**వరంగల్, మన చౌరాస్తా :** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని రామన్నపేట, బట్టల బజార్ ప్రాంతంలో ఉన్న శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామి ఆలయంలో డిసెంబర్ 30, 2025 (మంగళవారం) నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావలసిందిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారిని ఆలయ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆలయ ఈవో కిషన్ రావు, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు మంత్రిని కలుసుకుని ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు మంత్రికి వివరించారు.

# క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా మోడరన్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఎంపికైన 12 మంది కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లా క్రీడాకారులు రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో పాటు విద్యారంగంలోనూ ముందుండి, అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని సూచించారు. కబడ్డీ క్రీడలో నైపుణ్యం పెంపొందించుకొని క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ మోడరన్ కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎక్కడ ఉన్నా క్రమశిక్షణే విజయానికి మూలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోడరన్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పచ్చునూరి కరుణాకర్, జిల్లా కోశాధికారి సాతుర్ చంటి, సహాయ కార్యదర్శులు చాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యాం తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ తెలంగాణ తీసుకురాకుంటే రేవంత్ సీఎం అయ్యేవాడా?

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**కోహెడ, మన చౌరాస్తా** :స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టి, గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపి తెలంగాణను సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లేకపోతే, నేడు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డి కూర్చునేవాడా అని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యుడు వొడితల సతీష్ కుమార్ ప్రశ్నించారు.

శనివారం కోహెడ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి మరియు ఆయన మంత్రివర్గం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని ఇష్టానుసారంగా మాట్లాడడం తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే కాంగ్రెస్ నేతలకు వణుకు మొదలైందని, కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తే కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి నీచపు, దిగజారుడు భాషను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. నక్కకు పులి రంగు వేస్తే పులి కాకపోతుందని, రంగు వెలిసిన తర్వాత నక్క తన స్వభావాన్ని బయటపెడుతుందని వ్యాఖ్యానించారు.

రాజకీయాల్లో హుందాతనం ఉండాలన్నారు. సీఎం హోదాలో ఉండి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం అనుకోవాలా, లేబర్ అనుకోవాలా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు.

**ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయం**

సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన విజయాలతో కాంగ్రెస్ నాయకుల్లో భయం పట్టుకుందని అన్నారు. పంచాయితీ ఎన్నికల్లో గులాబీ సైనికులు చేసిన పోరాట ఫలితమే నేడు కాంగ్రెస్‌ను వణికిస్తున్నదని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, సహకార ఎన్నికలు నిర్వహించే సత్తా ఈ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ప్రజా మద్దతుతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**రైతుబంధుపై కుట్ర**

డిసెంబర్ చివరి వారంలో ఇవ్వాల్సిన యాసంగి రైతుబంధును శాటిలైట్ మ్యాపింగ్ పేరుతో ఎగ్గొట్టే కుట్రను కాంగ్రెస్ సర్కార్ చేస్తోందని ఆరోపించారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రైతుబంధు గుర్తుకొస్తుందని ప్రజలకు స్పష్టమైందన్నారు.

**తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష..**

పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సగటు జీవి బ్రతకడం కూడా కష్టమైందని అన్నారు. తెలంగాణను కాంగ్రెస్ నాశనం చేస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, అడుగడుగునా అడ్డుకొని ప్రజల్లో అవినీతి, అక్రమాలను ఎండగడతామని హెచ్చరించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, సహకార ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి దిమ్మతిరిగే జవాబు ఇవ్వాలని హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలను కోరారు. నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో జరగదని, తాను హుస్నాబాద్‌ను వదిలిపెట్టి వెళ్లిపోతానని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖండించారు. తాను ఇదే గడ్డమీద ఉండి హుస్నాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటూ విస్తృత సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కోహెడ మండల ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షుడు, మండల నాయకులు, గ్రామాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# భక్తులకు ఇబ్బందులు లేకుండా మహా జాతర

## కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి

**కొమురవెల్లి, మన చౌరాస్తా** : కొమురవెల్లి మల్లన్న మహా జాతర జనవరి 18 నుండి మార్చి 15 వరకు జరుగనున్న నేపథ్యంలో కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి, ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ పనులు, 50 గదుల సత్ర నిర్మాణ పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర సమయంలో భక్తుల సౌకర్యార్థం అవసరమైన పనులు వెంటనే జరిపించి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని, భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం శ్రమిస్తూ జాతర జరిగే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.






# అంజయ్యను పరామర్శించిన కవులు, కళాకారులు

**జనగామ, మన చౌరాస్తా** : జరసం వ్యవస్థాపకుల్లో ఒకరు, కవి జోగు అంజయ్య మాతృమూర్తి, వడ్డిచర్ల గ్రామ మొదటి సర్పంచ్ జోగు రాజయ్య సతీమణి జోగు రాజమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల గ్రామంలో అంజయ్యను కవులు కళాకారులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక భాగస్వామ్య సాహితి సంస్థలు జి.వై.గిరి ఫౌండేషన్ జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరా చారి, అభినందన కల్చరల్ సోసైటీ అయిలా సోమనర్సింహచారి, వర్కింగ్ కమిటీ మెంబర్ తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గొలుసుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ శతాబ్ది వేడుకలు ప్రారంభం




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా** : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం ఘనంగా సిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి కామ్రేడ్ బోడ బాలరాజ్ సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ ఆదర్శ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న స్థాపితమైన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం శతాబ్ద కాలంగా అలుపెరుగని పోరాటాలు, ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. అమరుల రక్తంతో తడిచిన ఎర్రజెండా వంద సంవత్సరాలు గడిచినా ఇంకా గర్వంగా రెపరెపలాడుతోందని పేర్కొన్నారు. జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభకు 45 దేశాల కమ్యూనిస్టు నాయకులు, లౌకికవాదులు, వామపక్ష పార్టీ నేతలు హాజరవుతారని తెలిపారు. సుమారు ఐదు లక్షల మందితో జరిగే ఈ చారిత్రాత్మక సభను విజయవంతం చేయగలమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ భీమదేవరపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ ఆదరి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ కొంగుల రామచందర్ రెడ్డి, కామ్రేడ్ రావుల తిరుపతి, కామ్రేడ్ పిట్టల రమేష్, కామ్రేడ్ ఆరేపల్లి కొమరయ్య, కాంగ్రెస్ నాయకుడు రాగుల చంద్రయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎర్రజెండా వైపే ప్రజల చూపు

## సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

**చేర్యాల, మన చౌరాస్తా** : సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఎర్ర జెండా వైపే ప్రజలు ఉంటారని CPM సిద్ధిపేట జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అన్నారు. ఈ రోజు చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన నంగి మైసయ్య తో పాటు పలువురు సిపిఎం పార్టీ లో చేరగా వారికి CPM జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండానే ప్రజల భవిష్యత్తు అని సిపిఎం వైపు ప్రజలు చూస్తున్నారని, ఇటీవల పెద్ద ఎత్తున పార్టీలో చేరికలు పెరిగాయని తెలిపారు. మండలంలో సంవత్సరాల తరబడి వివిధ సామాజిక తరగతులు రైతులు, కూలీలు, మహిళలు, యువకులు, విద్యార్థులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేకప్రజా ఉద్యమాలు నడిపిన పార్టీ సిపిఎం అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల విధానాలను ప్రజలు చూశారని ఆ పార్టీల పాలనలో విసిగి చెందిన ప్రజలు ఇక ఈ దేశానికి ఎర్రజెండా తప్ప మరో మార్గం లేదని ప్రజల ఆలోచిస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. అందులో భాగంగానే సిపిఎం వైపు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం స్థానిక సంస్థల్లో ప్రజలకు న్యాయం జరగాలంటే నీతి నిజాయితీ కలిగిన కమ్యూనిస్టులు గెలిస్తేనే నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అందుకే వచ్చే ఎంపీటీసీ ఎన్నికల్లో మండలంలో సిపిఎం పోటీ చేస్తుందని బలమైన గ్రామాలలో సిపిఎం సత్తా చాటుతామని, ప్రజలు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తి రెడ్డి, జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట్ మావో, మండల కార్యదర్శి బండకింది అరుణ్, చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్,జిల్లా కమిటి సభ్యులు దాసరి ప్రశాంత్ ,పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, పట్టణ నాయకులు పోలోజు శ్రీహరి, ఇప్పకయాల శోభ, తుప్పతి రాజు, బోయినీ మల్లేశం, గుర్జకుంట పార్టీ నాయకులు దర్శనం రమేష్, కాశెట్టి ఆంజనేయులు,శెట్టి కిష్టయ్య, బొప్పనపల్లి ఎల్లయ్య, కత్తుల నర్సింహారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం..

**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రజలకు ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ 54వ డివిజన్ పోచమ్మకుంట ప్రాంతంలో విశ్వ బ్రాహ్మణ, సగర కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూపత్రాలను ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో సామాజిక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించుకోవచ్చని చెప్పారు. అవసరమైతే తన సొంత నిధులు కూడా వినియోగిస్తానని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి 15 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 60వ డివిజన్‌లో టీచర్స్ కాలనీ, వాజ్ పాల్ కాలనీలో 65 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. భివృద్ధి పనులు ఏబీసీ కేటగిరీల్లో అత్యవసరత ఆధారంగా చేపడుతున్నామని తెలిపారు. వచ్చే నెలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కాజీపేట ఆర్ఓబీ పనులు వేగవంతం చేస్తామని చెప్పారు.



# మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

**మద్దూరు, మన చౌరాస్తా :** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, పద్మ విభూషణ్ డాక్టర్ మన్మోహన్ సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని మర్మాముల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆలేటి విష్ణు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. భారతదేశానికి వారి యొక్క సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



# సర్పంచ్ కి సన్మానం

**దూల్మిట్ట, మన చౌరాస్తా : నూతనంగా ఎన్నికైన ధూల్మిట్ట సర్పంచ్ గునుకుల లీల జగన్ మోహన్ రెడ్డిని సన్మానించారు. బెక్కల్ వార్డు మెంబర్ లకవత్ రెడ్య నాయక్ సర్పంచ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. ఆయన వెంట లకావత్ రాజు, ఇతరులు ఉన్నారు.**

# ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

**మద్దూరు, మన చౌరాస్తా :** మద్దూరు గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ దామెర మల్లేశం ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం రోజున ముస్లిం సోదరులు నమాజ్ చేసుకుని వస్తున్న సందర్భంలో వారితో కలిసి మాట్లాడుతూ నన్ను ఆదరాభిమానాలతో గెలిపించినందుకు మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని తెలియజేశారు. మద్దూరు గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సమస్యలు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే త్వరితగతిన పూర్తి చేస్తాను అని తెలియజేశారు.



# మృతురాలి కుటుంబానికి పెరిక కుల జిల్లా అధ్యక్షుడి పరామర్శ

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన శతాధిక వృద్ధురాలు దేశబత్తుల వరలక్ష్మీ మృతి చెందగా, వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ ఆధ్వర్యంలో నాయకులు వనపర్తి ధర్మరాజు, చింతం సారంగపాణి. నట్టె నారాయణ. రమేశ్ , అంకతి వివేక్ సాగర్ , అభిలాష్ కుమార్ తదితరులు ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించి, వారి కుమారులు దేశబత్తుల రమేశ్ సోదరులను పరామర్శించడమైంది.

## రాష్ట్ర అధ్యక్షుడి పరామర్శ ..

దేశబత్తుల వరలక్ష్మీ మృతికి తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ సంతాపం తెలిపారు. వారి కుమారులు దేశబత్తుల రమేశ్ కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు.

# బస్టాండ్ స్థలంలో ఇతర నిర్మాణాలు వద్దు

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్**



చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల నూతన బస్టాండ్ వద్ద ఇతర నిర్మాణాలు చేపడితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 సంవత్సరాల క్రితం కొత్త బస్టాండు నిర్మాణం కోసం చేర్యాల పట్టణానికి చెందిన గుళ్ళపల్లి తిరుమల యాదగిరిరావు, కల్వకోట సురేందర్ రావు లు సుమారు వంద కోట్ల విలువచేసే రెండు ఎకరాల పట్టా భూమిని బస్టాండ్ కోసం భూదానం చేశారని గుర్తు చేశారు. బస్టాండ్ కు కేటాయించిన భూమిలో భవిష్యత్తులో ప్లాట్ ఫారం పెరిగే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పడితే బస్సు డిపో కూడా వచ్చే పరిస్థితులు ఉంటాయన్నారు. బస్టాండ్ ను సుందరీకరణ, అభివృద్ధి చేయాల్సింది పోయి అక్రమంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు కందకం తీసి నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని, వాటర్ ట్యాంక్ నిర్మాణం వల్ల స్థలం కుదించబడి బస్సులు తిరగకుండా ఇబ్బందులు ఏర్పడి భవిష్యత్తులో బస్టాండు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సిద్దిపేట డిపో మేనేజర్ లు స్పందించి వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నిలిపివేసి బస్టాండ్ ను మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, వలబోజు నర్సింహా చారి, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, బంగారు ప్రేమ్ కుమార్, బూరుగు సత్తయ్యగౌడ్, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి,ఎగుర్ల ఎల్లయ్య, నంగి సత్తయ్య, మనేపల్లి కిష్టయ్య, సుంకోజు వెన్నెల, మ్యాక యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ బిల్లు రద్దు చేయండి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం అమలుచేయ తలపెట్టిన విబి_జి రాంజీ బిల్లు రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005ను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కాకర్ల పద్మ, మండల అధ్యక్షులు కాకర్ల బాబు డిమాండ్ చేశారు. మండలంలోని మంచుప్పుల గ్రామంలో శుక్రవారం వి బి జి రాంజీ బిల్లును రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ, బిల్లు ప్రతులను దహనం చేశారు. 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమక్రమంగా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ, చివరికి రద్దు చేయుటకు నిర్ణయించడం కార్మికుల పాలిట శాపమన్నారు. 2005లో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాణాల సోమయ్య, బాణాల మల్లయ్య, కాకర్ల సోమనర్సయ్య, సోమక్క, పాలడుగు యాదమ్మ, ఉదయ్, కాకర్ల వెన్నెల, రేణుక, ఇటిక లచ్చమ్మ, ,ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**